www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 8 నవంబర్ 2025
5
తూర్పుగోదావరి



10 నుంచి సమ్మెటివ్ -1 పరీక్షలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

అన్ని యాజమాన్య పాఠశాలలకు ఈ నెల 10వ తేదీ నుంచి సమ్మెటివ్ -1 పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రానికి చేరిన ప్రశ్న పత్రాల బండిల్స్ చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన బండిల్స్‌ను హెచ్‌ఎంలు సరిచూసుకున్న అనంతరం బాక్స్‌లలో భద్రపరచినట్లు తెలిపారు. పరీక్షకు గంట ముందు హెచ్‌ఎంలకు మాత్రమే ప్రశ్నాపత్రాల బండిల్స్‌ను అందచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కెవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ ఛైర్మన్ ఎంవిఎం.సుబ్రహ్మణ్యం, సిఆర్‌ఎంటిలు జయంతి శాస్త్రి, జె.శ్రీనివాసరావు, పబ్బినీడి ప్రసాద్, కుమారి, ఇందిర, నాగలక్ష్మి, కోటేశ్వరి, అర్బన్ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

సూర్యఘర్‌కు ఆదరణ కరువు

జిల్లాలో కేవలం 3298 సర్వీసులు మాత్రమే ఆసక్తి చూపని విద్యుత్ వినియోగదారులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో సూర్యఘర్ పథకానికి ఆశించిన స్థాయిలో ఆదరణ దక్కడం లేదు. తొలుత పెట్టుబడి, బ్యాంకు రుణాలు, మెయింటెనెన్స్ తదితర సమస్యలు ఉండటంతో విద్యుత్ వినియోగదారులు వెనకడుగు వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచితం, బిసిలకు సబ్సిడీ, మహిళా సంఘ సభ్యులకు ప్రాధాన్యం తదితర అవకాశాలున్నా ఆశించిన స్థాయిలో ఆదరణ లభించడం లేదు. జిల్లాలో గత ఏడాదిన్నర కాలంలో 3298 మంది మాత్రమే ఈ పథకాన్ని వినియోగించుకున్నారు. జిల్లాలో విద్యుత్ శాఖ వివిధ సర్వీసుల ద్వారా 8 లక్షలకు పైగా సర్వీసులకు విద్యుత్ సరఫరా చేస్తోంది. అయితే పేద, మధ్యతరగతి వర్గాలకు విద్యుత్ బిల్లుల భారం నుంచి తప్పించుకునేందుకు సోలార్ పలకలు ఏర్పాటు చేసుకోవాలని



పెద్దఎత్తున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రచారం చేస్తున్నాయి. అయితే క్షేత్రస్థాయిలో వినియోగదారులను వివిధ రకాల సమస్యలు వెంటాడుతున్నాయి. తొలుత ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చినా మొత్తం ఖర్చులో 20 నుంచి 40 శాతం వరకూ లబ్ధిదారులు ముందుగా పెట్టుబడి పెట్టాలి. అదే విధంగా ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ క్లిష్టంగా మారింది. బ్యాంకు నుంచి రుణం పొందటం, సబ్సిడీ క్లయిమ్ చేయడం వంటి వాటికి అధిక సమయం పడుతుంది. మరోవైపు సోలార్ ప్యానెల్స్ శుభ్రంగా ఉండటం, మోనిటరింగ్ చేయడం అవసరం. ప్యానెల్ లేదా ఇన్‌వెర్టర్ దెబ్బతిన్నపుడు మరమ్మతులు ఖర్చు లబ్ధిదారుడే భరించాలి. మరోవైపు ఇల్లు సౌరశక్తి కోసం సరైన దిశ లేకపోతే లేదా నీడ ఎక్కువైనా పవర్ ఉత్పత్తి తక్కువగా ఉంటుంది. పాత భవనాలు, అద్దె ఇళ్లు ఉన్నవారికి ఈ పథకం ఉపయోగించుకోలేకపోతున్నారు. ఇంకో వైపు ప్రభుత్వం నుంచి సబ్సిడీ రావటానికి 3 నుంచి 6 నెలల సమయం పడుతుంది. అదే విధంగా ప్యానెల్ల జీవిత కాలం 20 నుంచి 25 సంవత్సరాలు ఉన్నప్పటికీ ఇన్‌వెర్టర్ లేదా కేబుల్‌వంటి విడి భాగాలు 5 నుంచి 10 ఏళ్లలోపే మార్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. జిల్లాలో 35 ఏజెన్సీ లున్నాయి. వెండార్ ఎంపికలోనూ జాగ్రత్తలు తప్పనిసరి. సూర్యాఘర్ పథకంలో భాగంగా మూడు కిలోవాట్లకు సంబంధించి రూ.78 వేల వరకూ సాయం అందించనుంది. ఈ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుంటే ఇంటి అవసరాలకు పోను విద్యుత్ మిగిలి ఉంటే అమ్ముకోవచ్చని ప్రభుత్వం చెబుతోంది. డిస్కంలే కొనుగోలు చేసి ఆ నగదును లబ్ధిదారుడికి అందిస్తాయి. ఒకసారి సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటే 25 సంవత్సరాల పాటు నిరంతరాయంగా వాడుకోవచ్చు. ఒక కిలో వాట్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునేందుకు రూ.90 వేల నుంచి రూ.1.20 లక్షల వరకు ఖర్చవుతుంది. దీనికి రూ.30 వేల వరకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. రెండు కిలోవాట్ల ప్లాంట్ అయితే రూ.లక్ష నుంచి రూ.1.45 లక్షల ఖర్చు అవుతుంది. రూ.60 వేల వరకు సబ్సిడీ అందిస్తారు. మూడు కిలోవాట్లు అయితే రూ.1.80 లక్షల నుంచి రూ.2.20 లక్షల ఖర్చు అవుతుంది. రూ.90 వేల వరకు రాయితీ పొందవచ్చు. ఇంటి అవసరాలకు విద్యుత్‌ను పొదుపుగా వాడుకుంటే.. చాలా వరకూ మిగలనుంది. దానిని డిస్కంలకు అమ్ముకోవచ్చు.

సద్వినియోగం చేసుకోవాలి

సూర్యఘర్‌పై పెద్దఎత్తున అవగాహన కల్పిస్తున్నాము. వెండార్ల నుంచి ఎటువంటి సమస్యలు ఎదురైనా 1912కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ఇంటిపైన, ప్రాంగణాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. దీనికి రాయితీ సైతం అందిస్తాం. మిగులు విద్యుత్‌ను సైతం డిస్కంలు కొనుగోలు చేస్తాయి. ఇది మేలైన పథకం. వినియోగాదారులు సద్వినియోగం చేసుకోవాలి.

-తిలక్, ఎస్ఇ, ఎపిఇపిడిసిఎల్, తూ.గో.జిల్లా



అరుణపతాకాన్ని ఆవిష్కరిస్తున్న అరుణ్

సోషలిజంతోనే సమానత్వం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

సోషలిజంతోనే సమానత్వం సాధ్యం అని సిపిఎం జిల్లా కార్యదర్శి టి. అరుణ్ అన్నారు. శుక్రవారం స్థానిక శ్యామల సెంటర్‌లోని సిపిఎం కార్యాలయం ఎదుట సోషలిస్టు విప్లవ దినోత్సవం సందర్భంగా అరుణ పతాక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. తొలుత సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్ ఎర్ర జండాను ఎగురా వేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.పవన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ పెట్టుబడిదారి సమాజంలో శ్రమ చేసి సంపద సృష్టించేవాళ్లంతా పేదవాళ్లగానే ఉండిపోతున్నారన్నారు. పెట్టుబడిదారీ విధానంలో ప్రజా సమస్యలు ఎప్పటికీ పరిష్కారం కావని అన్నారు. అంబాని వద్ద రూ.17 లక్షల కోట్లు, అదాని వద్ద రూ.16 లక్షల కోట్లు ఆస్తి ఉందని, వీళ్ల ఆస్తులు శ్రామికుల కష్టంతో పెరిగాయని వివరించారు. విద్య, వైద్యం వంటివి ఉచితంగా అందించాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్లకు వ్యాపారంగా మార్చేసి, సామాన్యులను దెబ్బతీస్తున్నాయని తెలిపారు. సోషలిజంలో ఇటువంటి పరిస్థితి ఉండదన్నారు. కార్మికులకు సమ్మె చేసే హక్కు లేకుండా చేస్తున్నారని, బోనస్, సెలవులు ఇవ్వడం లేదని, పని గంటలను పెంచారని, ఇవన్నీ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే చేశారని అన్నారు. మోడీ, చంద్రబాబు పెట్టుబడదారుల కోసమే పని చేస్తారని అన్నారు. ప్రజాస్వామ్యం అంటే పెట్టుబడిదారులకు భయమన్నారు. సోషలిజంలో ఇళ్లు, ఉద్యోగం, తిండి, భూమి, మహిళలకు సమానత్వం హక్కుగా ఉంటుందని తెలిపారు. రోడ్లపై చెత్త ఊడ్చే వాళ్లకు సైతం ఉన్నతాధికారులతో సమానంగా జీతాలు ఉంటాయన్నారు. పెట్టుబడిదారీ విధానంలో ఇటువంటి ఉండవని తెలిపారు. సోషలిజం పర్యావరణాన్ని పరిరక్షిస్తుందన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని పూర్తిగా ప్రయివేటుపరం చేసి సబ్సిడీలను ఎత్తివేయాలని చూస్తోందన్నారు. దీనికి చంద్రబాబు, పవన్ తలాడిస్తున్నారని, ముందుగా డబ్బు చెల్లిస్తేనే విద్యుత్ ఇచ్చే పరిస్థితి తెస్తున్నారని వివరించారు. సకల సమస్యలకు సోషలిజమే పరిష్కారమన్నారు. అనేక వలస దేశాలలలో విముక్తి పోరాటానికి సోషలిస్టు విప్లవం నుంచి స్ఫూర్తిని పొందాయని గుర్తు చేశారు. రైతాంగంకు రక్షణ, యువతకు ఉపాధి, కార్మికుల హక్కుల రక్షణ, మహిళలలకు సమాన అవకాశాల కోసం జరిగే పోరాటాలలో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపు నిచ్చారు. దేశంలో కేరళలోని వామపక్ష ప్రభుత్వం మహిళల్లో అధిక అక్షరాస్యత సాధించి అభివృద్ధిలో మహిళలను ప్రధాన బాగుస్వామిగా చేసిందని గుర్తు చేశారు. తీవ్ర పేదరికంను తొలగించిన ఏకైక రాష్ట్రం కేరళలో పినరయి విజయన్ నాయకత్వంలో ఘనత సాధించిందన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ భారత దేశంలో కులావివక్షత పెద్ద సామజిక సమస్యగా నేటికీ కొనసాగుతుందన్నారు. కుల వివక్షత అంతమొందించాలని, సామాజిక న్యాయం సాధన సోషలిస్టు ప్రభుత్వంలో మాత్రమే సాధ్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు టిఎస్.ప్రకాష్, ఎస్ఎస్.మూర్తి, జిల్లా నాయకులు రామచంద్రరావు, నగర కార్యదర్శి కర్రి.రామకృష్ణ, నాయకులు మురళీ, సావిత్రి, తాతరావు, సోమేశ్వరావు, జరీనా, స్రవంతి, ఆనంద్, రాజా, రాంబాబు, భాస్కర్, జ్యాతి పాల్గొన్నారు.

ముందస్తు గుర్తింపుతో కేన్సర్ నివారణ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ముందుగా గుర్తించి, సకాలంలో చికిత్స తీసుకుంటే కేన్సర్ మృతుల తీవ్రతను నివారించవచ్చునని పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఆర్.ఉషాదేవి అన్నారు. శుక్రవారం జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవన శైలిలో మార్పులు కారణంగా బిప్లి, షుగర్ వ్యాధులతో పాటుగా, కేన్సర్ వ్యాధి ఎక్కువ సంఖ్యలో ప్రబలుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 18 సంవత్సరాలు పైబడిన ప్రతి పౌరునికీ ఉచితంగా నోటి, రొమ్ము, గర్భాశయ, ముఖ ద్వార క్యాన్సర్ వ్యాధులను ముందస్తుగా గుర్తించేందుకు, స్క్రీనింగ్ సదుపాయాలు కల్పిస్తున్నదన్నారు. ఈ సదుపాయాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ సుబ్రహ్మణ్యం, పిహెచ్ఎన్.కుమారి, స్టాఫ్ నర్సులు బ్యూలా, సంధ్య, ఝాన్సీ, ఎఎన్ఎం మార్తా, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రకారుడు బాపిరాజుకు ప్రశంసా పత్రం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

స్థానిక ఎస్‌కెవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ ఉపాధ్యాయులు, ప్రముఖ చిత్రకారులు డాక్టర్ పుప్పాల బాపిరాజుకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ప్రశంసాపత్రాన్ని అందించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో జస్టిస్ ఫర్ ఆల్ అనే థీమ్‌పై బాపిరాజు వేసిన చిత్రం అందరినీ అలరించింది. ఈ నేపత్యంలో శుక్రవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగిన ఒక కార్యక్రమంలో



బాపిరాజును అభినందిస్తున్న న్యాయమూర్తి

బాపిరాజును జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు, విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎపిఎం

పెరటితోట విత్తనాలు, మొక్కల పంపిణీ

ప్రజాశక్తి - సీతానగరం

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో శుక్రవారం మండలంలోని మునికూడలిలో ప్రతి ఇంటికి పెరటితోట విత్తనాలు, మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎపిఎం ఎండి.జిలాని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిలాని మాట్లాడుతూ ప్రకృతి పంట అనే లక్ష్యంతో గ్రామస్తుల సహకారాన్ని తీసుకున్నామన్నారు. ఎపి కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ సిబ్బంది ద్వారా గ్రామంలోని పెద్దలను కలిసి, పెరటితోటల కోసం విత్తనాలు, మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. వంగ, మిర్చి, టమాటా వంటి కూరగాయల మొక్కలు, విత్తనాలను అందించడంలో దాతలు ముందుకు వచ్చారని అన్నారు. ఎన్‌టిఆర్ సేవ సమితి ద్వారా మల్లి వెంకట రామారావు, ప్రత్తిపాటి వరలక్ష్మి, వెంకటేశ్వరరావు, మల్లి వీరాస్వామి, పాదే రోజ్ లిన్, జోష్ లిన్ విత్తనాలు అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆనిమిల్లి సత్యవతి, ప్రకృతి వ్యవసాయ ఎన్‌టి మాస్టర్ ట్రైనర్ వరలక్ష్మి, జిల్లా సమైఖ్య ప్రెసిడెంట్ కందికట్ల అరుణకుమారి, కొయ్యలమూడి సునీత, ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

దేశానికి నిజాయితీగా సేవ చేయాలి

ఆర్ట్స్ కళాశాల స్నాతకోత్సవంలో నన్నయ విసి ప్రసన్నశ్రీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

డిగ్రీలు సాధించిన విద్యార్థులు నిజాయతీగా దేశానికి సేవలందించాలని ఆదికవి నన్నయ యూనివర్శిటీ విసి ప్రసన్నశ్రీ సూచించారు. స్థానిక ప్రభుత్వ కళాశాల ఆర్ట్స్ కళాశాల స్నాతకోత్సవం శుక్రవారం ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 2018-21, 2019-22 సంవత్సరాల్లో డిగ్రీ విద్యార్థులకు ఈ సందర్భంగా డిగ్రీలను ప్రదానం చేశారు. సిఇఇ డాక్టర్ కె.బాబు ఆధ్వర్యంలో ఆనం కళా కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కామర్స్ స్ట్రీమ్‌లో, సెమిస్టర్ చివరి పరీక్షలకు హాజరైన 302 మంది విద్యార్థుల్లో 2018-21లో 73.50 శాతం ఉత్తీర్ణతతో 222 మంది విద్యార్థులు డిగ్రీలు సాధించారు. 2019-22లో, 385 మందికి 81.03 శాతం ఉత్తీర్ణతతో 312 మంది డిగ్రీలు సాధించారు. సైన్స్ విభాగంలో 2018-21లో 856 మందిలో 75 శాతం ఉత్తీర్ణతతో 642 మంది విద్యార్థులు డిగ్రీలు పొందారు. 2019-21లో 906 మందికి 86.64 శాతం ఉత్తీర్ణతతో 785 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తంగా 2,349కి డిగ్రీలను ప్రదానం చేశారు.



స్నాతకోత్సవంలో బంగారు పతకాలను అందకున్న విద్యార్థులతో విసి, ప్రిన్సిపల్ తదితరులు

2018-19, 2019-22లో 45 విభాగాల్లో 87 మంది టాపర్లకు బంగారు పతకాలు అందించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర అధ్యక్షత వహించి కళాశాల నివేదికను వివరించారు. గ్రాడ్యుయేషన్ అనేది ఒక ముగింపు, ప్రారంభం కూడా అన్నారు. డిగ్రీలను అందుకోవడానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి అభినందనలు తెలిపారు. కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ కె.బాబు ఆర్ట్స్, సైన్స్, కామర్స్ విభాగాల్లో డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థుల నివేదిక ను అందించారు. అనంతరం విసి ప్రసన్నశ్రీ మాట్లాడారు. గ్రాడ్యుయేషన్ డే అనేది విజయానికి ఒక వేడుక మాత్రమే కాదు, ఆలోచించే క్షణమని అన్నారు. ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోనాలన్నారు. ప్రత్యేక అతిథిగా కళాశాల విద్యాశాఖ సిసిఇ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి కృష్ణ హాజరై మాట్లాడారు. విద్యార్థులు పెద్ద కలలను కని వాటిని నెరవేర్చుకునేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డివిఎన్.శ్రీరామ్మూర్తి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి పౌరునికీ సమ న్యాయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

ప్రతీ పౌరునికి సమన్యాయం రాజ్యాంగం కల్పించిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ప్రధాన లక్ష్యం మహిళలు, పిల్లలు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్లు, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల లబ్ధి అందేలా చూడడం కోసమేనని అన్నారు. ఆర్టికల్ 39-ఏ ప్రకారం ప్రతి పౌరుడు న్యాయ సహాయం పొందే హక్కు కలిగివున్నాడని, ఆర్టికల్స్ 1, 14, 22 ప్రకారం అందరికీ సమాన హక్కులు, సమ న్యాయం లభించాలని రాజ్యాంగం స్పష్టం చేస్తోందని వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 867 మందికి లీగల్ ఎయిడ్, 3,513 అవగాహన కార్యక్రమాల ద్వారా 1,76,678 మందికి సేవలు, 76 ర్యాలీల ద్వారా 10,415 మందికి అవగాహన, 847 ప్రదేశాల్లో పర్యటించి 10,201 మందికి ప్రయోజనం కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి ఎవి.సుబ్బరాజు 9వ అదనపు జిల్లా



సభలో మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి సునీత

జడ్జి ఎం.మాధురి, డిఎల్ఎస్ఎ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి, బార్ అసోసియేషన్ ప్రతినిధి పివిఎస్‌కె. శోభనాథశాస్త్రి, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు, ప్యానల్ అడ్వకేట్లు, లీగల్ ఎయిడ్ వాలంటీర్లు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ నూతన పాలకవర్గం

రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్‌గా తరుణ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్‌గా డాక్టర్ జి.తరుణ్ ఎన్నికయ్యారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో డిఆర్ఒ టి.సీతారామమూర్తి అధ్యక్షత రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా పాలకవర్గం ప్రమాణస్వీకారం ఘనంగా జరిగింది. కలెక్టర్ తరుపుత డిఆర్ఒ నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేయించారు. ఎన్నికల ప్రక్రియను రెడ్‌క్రాస్ సొసైటీ పరిశీలకుడు పి.రామచంద్రరాజు పర్యవేక్షించారు. ఛైర్మన్‌గా డాక్టర్ జి.తరుణ్, వైస్ ఛైర్మన్‌గా డాక్టర్ కెవి.రమణ, కోశాధికారిగా డాక్టర్ జివిఎన్‌విఎబిఎస్.మహాలక్ష్మి ఎన్నికయ్యారు. మేనేజింగ్ కమిటీ సభ్యులుగా డాక్టర్ ఎంఎ.బేగ్, డాక్టర్ లంకా సత్యనారాయణ, బి.రామకృష్ణ, బి.పద్మావతి, జె.సురేష్, డాక్టర్ జి.రాజేశ్వరి, నరేష్‌కుమార్ రాజు, బల్లా శ్రీనివాసు ఎన్నికయ్యారు. ఈ కమిటీ మూడేళ్ల పాటు కొనసాగనుంది. డిఆర్ఒ సీతారామమూర్తి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సేవా భావానికి ప్రతీక అన్నారు. నూతన ఛైర్మన్ తరుణ్ మాట్లాడుతూ ఛైర్మన్ అనేది హోదా కాదని బాధ్యత అన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీని సమాజానికి దగ్గరగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. కలెక్టర్ మార్గదర్శకత్వంలో ప్రతీ సభ్యుని సూచనలతో ముందుకు సాగుతామన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ పరిశీలకుడు రామచంద్రరాజు ఎన్నికల ప్రక్రియను వివరించారు.

తానీషాకు రెండు బంగారు పతకాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం రూరల్ కాతేరు జడ్‌పి ఉన్నత పాఠశాల ఏడో తరగతి విద్యార్థి ఎమ్‌డి.ఇమామ్ తానీషా ఇంటర్ డిస్ట్రిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో రెండు బంగారు పతకాలను సాధించాడు. ఈనెల 1 నుంచి 8వరకూ కాకినాడ జిల్లాలో జరుగుతున్న 37వ ఇంటర్ డిస్ట్రిక్ ఛాంపియన్ షిప్ పోటీల్లో 100 మీటర్ల డిఆర్ఎసిఇ, 500 మీటర్ల డిఆర్ఎసిఇ విభాగంలో తానీషా ఈ పతకాలు సాధించాడని హెచ్‌ఎం డి అనిత, పీడీ



పిఎంవి.ప్రకాశ్ తెలిపారు. డిఇఒ కె.వాసుదేవరావు విద్యార్థి తానీషాను అభినందించారు. తానీషా 63వ రూరల్ స్కేటింగ్ ఫెడరేషన్ నేషనల్ పోటీలకు ఎంపికయ్యాడని హెచ్‌ఎం తెలిపారు.

డిఫెన్స్ అకాడమీలో విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - సీతానగరం


మండలంలోని వంగలపూడి గ్రామానికి చెందిన ప్రత్తిపాటి వీరబాబు (19) అనకాపల్లి జిల్లా సబ్బవరంలోని ఓ ప్రయివేట్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. ఈ క్రమంలో గురువారం అకాడమీ హాస్టల్‌లో ఉరేసుకుని ఆత్మ హత్య చేసుకున్నాడని ఆకాడమీ నుంచి తల్లిదండ్రులకు సమాచారం వచ్చింది. దీంతో వారంతా గ్రామం నుంచి బయలుదేరి వెళ్లారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వాలీబాల్ జట్టు మేనేజర్‌గా గంగాధరరావు

ప్రజాశక్తి - చాగల్లు

ఆంధ్రప్రదేశ్ వాలీబాల్ జట్టు మేనేజర్‌గా మండలంలోని ఊనిగట్ల జడ్‌పిహెచ్ఎస్ పీడీ కొయ్య గంగాధరరావు ఎంపికయ్యారు. జాతీయస్థాయిలో జరిగే అండర్ 17 బాలురు వాలీబాల్ పోటీలు ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకూ ఉత్తరప్రదేశ్‌లో జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఆయన మేనేజర్‌గా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఎస్ఎంసి ఛైర్మన్ నందిగం శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షులు బొల్లిన శివనాగేంద్ర, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

కార్టూ'నిజం'



స్ఫూర్తిమంత్రం.. వందేమాతరం

ప్రజాశక్తి - యంత్రాంగం

రాజమహేంద్రవరం రూరల్ ప్రజల్లో దేశభక్తి, ఏకత్వం, త్యాగస్ఫూర్తిని వందేమాతరం గీతం నింపిందని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో వందేమాతరం గేయలాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'వందేమాతరం కేవలం గీతం కాదు, భారతీయుల అస్మిత, గౌరవం, అభిమానం, ఏకత్వానికి ప్రతీక' అని అన్నారు. ప్రతి ఒక్కరు ఈ పవిత్ర గీతాన్ని ఆలపిస్తూ స్వాతంత్ర్య వీరుల త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై.మేఘాస్వరూప్, డిఆర్ఒ టి.సీతారామమూర్తి, గిరిజన, బిసి సంక్షేమ శాఖ అధికారులు కెఎన్.జ్యోతి, బి. శశాంక్, వైస్ ప్రిన్సిపల్ వి.గీతా, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద వందేమాతర గీతాలాపన కార్యక్రమం ఆరోగ్య, ఐసిడిఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వేంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది, ఆంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, పాల్గొన్నారు. **రాజమహేంద్రవరం సిటీ** దేశ స్వాతంత్ర్యోద్యమంలో 'వందేమాతరం' ఒక స్ఫూర్తివంతమైన రణ నినాదమని రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా అన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్య మైదానంలో శుక్రవారం సామూహిక వందేమాతరం గేయాలాపాన కార్యక్రమం జరిగింది. 150 ఏళ్ల క్రితం బకించంద్ర ఛటర్జీ భారతదేశపు ఔన్నత్యాన్ని, సామాజిక చైతన్యాన్ని, భౌగోళిక వైవిధ్యాన్ని, భరతమాత శక్తి, సామర్థ్యాన్ని వివరిస్తూ అద్భుతమైన పదజాలంతో ఈ గీతాన్ని రాశారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, అన్ని విభాగాల హెచ్‌ఒడిలు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే స్థానిక కోటగుమ్మం సెంటర్‌లోని జిల్లా విద్యాశాఖా కార్యాలయంలో వందేమాతర గీతాలాపన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఇఒ కంది వాసుదేవరావు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** మండలంలోని రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాలతోపాటు, పలు విద్యా సంస్థల్లో వందేమాతర గీతాలాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు. **పెరవలి** మండలంలోని రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాలతోపాటు, పోలీస్‌స్టేషన్, పిహెచ్‌సిలు, ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థల్లో వందేమాతర గీతాలాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **దేవరపల్లి** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన వందేమాతరం గీతాలాపన కార్యక్రమంలె ఎంపిపి కెవికె.దుర్గారావు, ఎంపిడిఒ నాగార్జునరావు, ఎంఇఒలు ఎం.తిరుమలదాస్, కెఆర్ఎస్‌వివి.అప్పారావు, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. **సీతానగరం** రెవెన్యూ, మండల పరిషత్, సొసైటీలు, పిహెచ్‌సిలు, ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థల్లో వందేమాతర గీతాలాపన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ఛైర్మన్లు, వైద్యులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. **గోపాలపురం** మండలంలోని పలు ప్రాంతాల్లో వందేమాతర గీతాలాపన కార్యక్రమాలు జరిగాయి. రాజంపాలెం హైస్కూల్ విద్యార్థులతో 100 అడుగుల జాతీయ పతాకంతో భారీ ర్యాలీ నిర్వహించారు.

నేరాలు ఘోరాలు

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నిడదవోలు

పట్టణంలో ఓవర్ బ్రిడ్జ్ వద్ద శుక్రవారం ఉదయం ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకులు డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో చాగల్లు మండలం మార్కొండపాడుకు చెందిన నామనకోట సత్యం అక్కడికక్కడే మృతి చెందగా, అరిగళ్ళ సాయిదుర్గ, నాగిరెడ్డి మంగేశ్వర్ తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను స్థానికులు హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలించారు. యువకులు ముగ్గురు బైక్ పై పని నిమిత్తం వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



బియ్యం స్వాధీనం చేసుకున్న వ్యాన్ వద్ద అధికారులు

పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - నల్లజర్ల

మండలంలోని అనంతపల్లి శివారు వీరవల్లి టోల్ ప్లాజా వద్ద అక్రమంగా రవాణా చేస్తున్న పిడిఎస్ బియ్యాన్ని విజిలెన్స్, సివిల్ సప్లై అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రెండు బొలెరో వాహనాల్లో తరలిస్తున్న సుమారు 8 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులపై పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారి మధుబాబు, సివిల్ సప్లై అధికారి కె.విజయ్‌కుమార్ తెలిపారు. రేషన్ బియ్యం ఏలూరు పరిసర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి కాకినాడ పోర్టుకు తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో వాహన తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో వ్యాను పై వరకు బియ్యం ప్రభుత్వ సంచులతో నింపి పైన ఒక లేయర్ పనికిరాని కొబ్బరికాయలతో రవాణా చేస్తుండగా గుర్తించి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు.

భార్యపై కొడవలితో దాడి

ప్రజాశక్తి - గోపాలపురం

భార్యపై అనుమానం పెంచుకున్న భర్త మద్యం మత్తులో కొడవలితో భార్యపై దాడి చేసిన సంఘటన మండలంలోని దొండపూడి గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..దొండపూడి మేదరపేటకి చెందిన కాసాని రామకృష్ణ తన భార్య సింధుపై అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి 1.00 సమయంలో మద్యం మత్తులో భార్యపై కొడవలితో దాడి చేశాడు. ఈ దాడిలో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో హత్యా ప్రయత్నం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరు పట్టణానికి చెందిన దేశభక్తుల వెంకటేశ్వరరావు తనను చీటీల పేరుతో మోసగించినట్లు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు సిఐ పి.విశ్వం తెలిపారు. నందమూరిలో వారి వీధికి చెందిన గుర్రాల లీలాదేవి, వెంకట సత్యనారాయణ, యూగాలి బుజ్జి అనే ముగ్గురు తమను రిజిస్టర్ చీటీలను నడుపుతున్నట్లు నమ్మించి చీటీలు కట్టించుకున్నారు. 2023 జూన్ లో రూ.5 లక్షల తన భార్య పేరుతో 2023 డిసెంబర్ నుంచి రూ.3 లక్షలు చిట్టీ కట్టించుకున్నారన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో చీటీలు పాడినప్పటికీ ఇంతవరకు సొమ్ము చెల్లించలేదని ఫిర్యాదు చేశారన్నారు. ఏ విధమైన రిజిస్ట్రేషన్ లేకుండా అక్రమంగా చీటీలు నడపడంతోపాటు, రూ. 8 లక్షలు కట్టించుకుని మోసం చేశారని ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

రాజవరంలో సారా స్వాధీనం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని రాజవరం గ్రామంలో ఎక్సైజ్ సిఐ కె.శాత్యాయని శుక్రవారం తన సిబ్బందితో సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులో తీసుకొని అతను వద్దనుండి ఐదు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి కొత్తపేట కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎక్సైజ్ సిఐ తెలిపారు.

గంజాయి కేసులో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి-గండేపల్లి

గండేపల్లి గ్రామ శివారు ఎన్.టి.రాజపురం రోడ్డులో ఒక కారు స్వాధీనం చేసుకుని ముగ్గురిని గంజాయితో అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శివ నాగబాబు తెలిపారు. వారి వద్ద 21.7 కేజీల గంజాయి, 3 మొబైల్ ఫోన్లు, రూ.2 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. వారిని పెద్దాపురం కోర్టుకి రిమాండ్ నిమిత్తం తరలించినట్లు తెలిపారు.

కాల్వలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలోని ఉప్పలపాడు చెందిన యాదాల దుర్గాప్రసాద్ ఉన్ను (21) ఉప్పలపాడు గ్రామ శివారులో ఉన్న పోలవరం కాలువ వద్ద కాలకృత్యాలకు వెళ్లి ప్రమాదవశాత్తు కాల్వలో పడి మృతి చెందాడు. శుక్రవారం అతడి మృతదేహాన్ని గుర్తించి అతడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రేమ పేరుతో మోసం : వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

పెళ్లి చేసుకుంటానని ప్రేమ పేరుతో బాలికను మోసి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పిఠాపురం సిఐ శ్రీనివాస్, ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. అమీనాబాద్ గ్రామానికి చెందిన కొండ అంజిబాబు గత సంవత్సరం నుంచి బాలికను పెళ్లి చేసుకుంటానని చెప్పి శారీరక సంబంధం పెట్టుకున్నాడన్నారు, దీంతో ఆ బాలిక గర్భవతి కావడంతో మాత్రలు ఇచ్చి అబార్షన్ చేయించినట్లు తెలిపారు. పెళ్లి చేసుకోమని అడుగుతున్న కొండబాబు నిరాకరించడంతో బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొండబాబును అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

యానాం వార్తలు



ఆందోళన చేస్తున్న కాంగ్రెస్, విసికె, సిఐటియు నాయకులు

విద్యుత్ ఛార్జీల పెంపుపై ఆందోళన

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచడంతో కాంగ్రెస్ పార్టీ, విసికె పార్టీ, సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. స్థానిక ప్రాంతీయ పరిపాలన అధికారి కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ యానాం అధ్యక్షులు అర్థాని దినేష్ మాట్లాడుతూ ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపిందన్నారు. వివిధ టాక్స్‌లతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోందన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్ఎఒ అంకిత్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మెల్లం చిన్న, సిఐటియు దుర్గాప్రసాద్, చెక్కల అరుణ్ కుమార్, పైడికొండల రాజబాబు తదితరులు పాల్గొన్నారు .



ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు దుర్గాప్రసాద్, సత్యనారాయణ, కార్మికులు

లేబర్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలని ధర్నా

ప్రజాశక్తి - యానాం

కార్మికుల సమస్యలు పట్టించుకునే వారు లేరని, కార్మికుల సమస్యలను తెలిపేందుకు లేబర్ అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ యానాంలో లేకపోవడంపై సిఐటియు ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు గుదే దుర్గాప్రసాద్ మాట్లాడుతూ గత సంవత్సరం నుంచి లేబర్ కార్యాలయంలో లేబర్ అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ లేరని గత పరిపాలనాధికారి ఆర్.మునిస్వామికి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. కార్మికులు అనేక సమస్యలతో బాధపడుతున్నారని ఆ సమస్యను చెప్పుకోవడానికి సంబంధిత అధికారి లేకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కన్వీనర్ కుంచే సత్యనారాయణ, అనసూరి శ్రీనివాసరావు, తిరుకోటి శ్రీనివాసరావు, సబ్బతి రాంబాబు, దాసరి రాజు, కె మధుబాబు, రాజశేఖర్, నాగబాబు, హరికష్ణ తదితరులు పాల్గొన్నారు.



వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న విద్యార్థులు

ఘనంగా వందేమాతరం గీతాలాపన

ప్రజాశక్తి - యానాం

వందేమాతరం గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు శుక్రవారం స్థానిక రాజీవ్ గాంధీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రాంగణంలో విద్యార్థులు వందేమాతర గేయాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా స్థానిక ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఎఒ అంకిత్ కుమార్ పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఉపాధ్యాయుడు హంసాని రామలక్ష్మణుడు వందేమాతర గేయం విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ముందుగా వందేమాతరం గేయ రచయిత బంకించంద్ర చటర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్, ఎడిపిసి కమిడి ప్రభాకర్ పాల్గొన్నారు.

3వ రోజుకు ఎఫ్‌టిసిఎల్‌ఆర్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రజాపనుల శాఖలో 20 ఏళ్ల నుంచి ఎఫ్‌టిఎల్‌ఆర్‌లుగా పనిచేస్తోన్న 126 మందిని పర్మినెంట్ చేయ్యాలని సిబ్బంది మూడో రోజు కూడా నిరసన చేపట్టారు. శుక్రవారం ప్రజా పనుల శాఖ కార్యాలయం వద్ద మూడో రోజు గేట్ మీటింగ్ నిర్వహించారు. పిడబ్ల్యుడి కార్యాలయం ఎదుట ప్లకార్డులతో ఆందోళన చేశారు. ఈ నిరసనకు ప్రముఖ వ్యాపారవేత్త తోటరాజు మద్దతు పలికి సంఘీభావం తెలిపారు. అరదాడి పోసియ్య, కర్రి పేర్రాజు, మున్నా, బాబీ పాల్గొన్నారు.

భార్య గొంతు కోసి... భర్త ఆత్మహత్య

ప్రజాశక్తి- తాళ్లరేవు

మనస్పర్థల కారణంగా భార్యపై హత్యాయత్నం చేసి అనంతరం భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు కాకినాడ జిల్లా కాజులూరు మండలం శీల గ్రామానికి చెందిన చీపురుపల్లి రాజేష్, దేవిలకు 14 ఏళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలం వారి కాపురం సజావుగానే సాగింది. ఇటీవల వారి మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ కారణంగా కాకినాడ డ్రైవర్స్ కాలనీలో తల్లి ఇంటి వద్ద దివ్య ఉంటుంది. శుక్రవారం రాజేష్ కాకినాడలో ఉంటున్న భార్య దేవి వద్దకు వెళ్లాడు. కత్తితో ఆమె గొంతు కోసి పరారయ్యాడు. రక్తపుమడుగులో ఉన్న దివ్యను కుటుంబ సభ్యులు హుటాహుటిన కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె చావుబ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. పరారైన రాజేష్ తాళ్ళరేవు మండలంలోని పటవల పంట పొలాల వద్దకు వెళ్లాడు. కత్తితో తన గొంతు కోసుకుని మరణించాడు. ఘటనా ప్రాంతాన్ని కోరంగి ఎస్ఐ సత్యనారాయణ పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

పిఠాపురం సిఐ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉప్పాడ కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కోనపాపపేట, అమీనాబాద్ గ్రామాల్లో సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ బ్యాంకు, క్రెడిట్ కార్డు వివరాలు, ఆధార్, ఎటిఎం పిన్ నంబర్లు, వ్యక్తిగత బ్యాంకింగ్ సమాచారం, ఒటిపిలు ఎవరికీ చెప్పొద్దన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న అసత్య కథనాలను నమ్మరాదని, అవి గందరగోళానికి దారి తీయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెజ్లింగ్‌లో విద్యార్థినులకు గోల్డ్ మెడల్స్

ప్రజాశక్తి - సామర్లకోట

వేట్లపాలెం కొండపల్లి గంగన్న మెమోరియల్ జెడ్‌పి పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలలో సత్తా చాటారు. కృష్ణాజిల్లాలో ఈ నెల 6 వరకూ జరిగిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఈ పాఠశాల విద్యార్థినులు అండర్-14 విభాగంలో దాసరి సుదీష్ట గోల్డ్ మెడల్ సాధించగా, అండర్-17 విభాగంలో దాసరి హారికశ్రీ గోల్డ్ మెడల్ అందుకున్నారు. వీరిద్దరూ అక్క చెల్లెళ్లు కావడం విశేషం. వీరు ఉత్తరప్రదేశ్‌లో డిసెంబర్ 8 నుండి 12 వరకు జరగనున్న నేషనల్ రెజ్లింగ్ పోటీలకు రాష్ట్రం తరపున ఎంపియ్యారు.

11న వైద్య విద్య ప్రయివేటీకరణపై ర్యాలీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఈనెల 11వ తేదీన పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించనున్నట్లు వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపి మార్గాని భరత్‌రామ్ తెలిపారు. శుక్రవారం నగరంలోని 45, 46 వార్డుల్లో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు. దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను అడ్డుకోడానికి కోటి సంతకాల సేకరణ చేస్తున్నామని తెలిపారు. నగరంలో బ్లేడ్ బాచ్ ఆగడాలు మితిమీరిపోయాయని ఆయన విమర్శించారు. మరి బ్లేడ్ బ్యాచ్ ని అరికడతామని ప్రగల్భాలు పలికిన ఉత్తర కుమారుడు ఏమైపోయాడని ఆయన ప్రశ్నించారు. ఆయన చెప్పే మాటలకూ చేసే పనులకు పొంతన లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రెయిన్ పనులను పూర్తి చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ



పనులను పరిశీలిస్తున్న కమిషనర్

డ్రెయిన్ నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. శుక్రవారం నగరంలోని 9వ వార్డు శ్రీనివాసనగర్లో చేపట్టిన డ్రెయిన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిపై ఆరా తీశారు. ప్రజల సౌకర్యం దృష్ట్యా పనులు అత్యుత్తమ నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా వెనువెంటనే రిస్టోరేషన్ పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఇన్‌ఛార్జ్ ఎస్ఇ రీటా, డిఇ లోవరాజు, ఎఇ దుర్గాప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - నల్లజర్ల



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సినీనటుడు బాలాజీ

లయన్స్ క్లబ్ దూబచర్ల, పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఘంటా వారి గూడెం పాత పంచాయతీ వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సినీ నటుడు మొల్లేటి బాలాజీ శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరానికి వచ్చిన ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. మదర్ వన్నిని హాస్పిటల్ వైద్య బృందం వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో పార్డ్ ఇండియా జాతీయ అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు, తాతిన సత్యనారాయణ, డాక్టర్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి

ప్రజాశక్తి - దేవరపల్లి

ధన్వంతరి స్వామి జయంతి వేడుకను మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు, టిడిపి సీనియర్ నాయకుడు సుంకర దుర్గారావు, జనసేన నాయకులు లీలా గంగాధర్, నాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్కాపురం కనకారావు, రాష్ట్ర నాయకులు రావులపాలెం మల్లేశ్వరరావు, రాయవరపు గణపతి, మండల అధ్యక్షుడు కడియం సత్తిబాబు, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వర్తనపల్లి కాశి, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు కొడవర్తి శివప్రసాద్, వెన్నెటి నాగేశ్వరరావు, లంక రాజు, కడియం శ్రీనివాసరావు, పసుపులేటి శివశ్రీను, బాదంపూడి నాగేశ్వరరావు, డాక్టర్ ఈతకోట రమేష్, తణుకు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల్లో ఎంఎల్‌ఎ 'తాడిపర్తి'

ప్రజాశక్తి - కడియం




ఎంఎల్‌ఎకు స్వాగతం పలికుతున్న గోపాలరావు

ప్రకాశం జిల్లా యర్రగొండుపాలెం ఎంఎల్‌ఎ తాడిపర్తి చంద్రశేఖర్ శుక్రవారం మండలంలోని కడియపులంక గ్రామానికి చెందిన వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ ఈలి గోపాలరావు నివాసానికి విచ్చేశారు. గోపాలరావు ఆయనకు మొక్క ఇచ్చి సాదరంగా ఆహ్వానం పలికారు. అనంతరం కడియపులంక లోని పలు నర్సరీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటు చూసినా పచ్చని నర్సరీలతో ఆహ్లాదకర వాతావరణంలో నర్సరీలు కనువిందు చేస్తున్నా యన్నారు. నర్సరీరంగం ద్వారా ఉపాధి పొందడమే కాకుండా, వివిధ రకాల ఔషధ మొక్కలు పూల మొక్కలు పెంచుతూ పర్యావరణ పరిరక్షణకు, ప్రజల ఆరోగ్య పరి రక్షణకు తోర్పడుతున్న నర్సరీ రైతులను అభినందించారు.

వైసిపి కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - సీతానగరం



సంతకాలు సేకరిస్తున్న వైసిపి నాయకులు

మండలంలోని చీపురుపల్లి గ్రామంలో వైద్య విద్య ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకుడు పెందుర్తి దేవదాసు పాల్గొని మాట్లాడారు. వైద్య విద్య ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కోండ్రపు ముత్యాలు, గోపిశెట్టి అనురాధ, ఉప సర్పంచ్ అనిమిల్లి బుజ్జియ్య, వైసిపి నాయకులు మనెల్లి వెంకట్రావు, గిల్లా శ్రీను, గణపతి లక్ష్మీ, ముదునూరి కిట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - నిడదవోలు

మున్సిపాలిటీలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల ను మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా సకాలంలో పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ పువ్వల రతిదేవి, కౌన్సిలర్ ఉసురుమర్తి జాన్‌బాబు, గంగుల గోపియాదవ్, మునిసిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, అధికారులు పాల్గొన్నారు.

భవిత సెంటర్‌లో పుట్టిన రోజు వేడుక

ప్రజాశక్తి - గోకవరం

స్థానిక దాసరి వారి వీధిలోని భవిత సెంటర్‌కు చెందిన విద్యార్థి రాఘవ పుట్టిన రోజును శుక్రవారం గోకవరం డ్రైవర్స్ కాలనీ పాఠశాల ఎస్ఎంసి ఛైర్మన్ నక్క రామరాజు నిర్వహించారు. కేకు కట్ చేసి పిల్లలకు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దాసపాటి సుబ్బారావు, ప్రగడ ప్రభ, మహిపాల పాండు రాజు, తాటికొండ సురేష్, మండే గౌతమ్, మణికంఠ, అంబటినాగు, వెంకట రామకృష్ణ, పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమావేశం

ప్రజాశక్తి - నల్లజర్ల

స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మండల విశ్రాంత ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎంవిఎస్.సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సమస్యలు, హెల్త్ కార్డులు, పెన్షనర్ల పేస్లిప్పు, పెన్షనర్ వార్తాపత్రిక సమాచారం తదితర సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎం ఆలీసాహెబ్, ఐడివి.అప్పారావు, జిల్లా కార్యదర్శి కె.ఏసురత్నం, సభ్యులు కె.ప్రభుదాసు, ప్రతాప్, ఎస్.బాలయ్య, వి.కామేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు యు.వెంకటేశ్వరరావు, తదితర పెన్షనర్లు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - గోకవరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.గోవిందు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి జిఎం వాణిధరామన్ పాల్గొని మాట్లాడారు. డ్వాక్రా మహిళలు చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు అవసరమయ్యే రుణాలు, వాటి ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారి టివి.సూర్యప్రకాష్, ఎపిఎం జయంత్ రాజు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మట్టి నమూనా సేకరణపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో 11వ తరగతి విద్యార్థులకు శుక్రవారం మట్టి నమూనా సేకరణ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో సామర్లకోట భూసార పరీక్షా కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మాధవి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా ఈ అవగాహన సదస్సు నిర్వహించినట్టు తెలిపారు. భూసార పరీక్ష చేయడం వల్ల రైతులకు తమ భూమిలో ఏ పంటకు ఏ ఎరువు భూసారం అనుసారం ద్వారా వేయడం సులభం అవుతుందన్నారు. ఎడిఎ నల్లి దైవ కుమార్, ఎఒ కె.సంజయ్ కుమార్, పికెవి.లక్ష్మి, నవోదయ వైస్ ప్రిన్సిపల్ జగన్మోహనరావు, సైన్స్ టీచర్ మధుబాలరావు, పిఎస్ఎం.విష్ణు పాల్గొన్నారు.